అమ్మో.. జూన్!



- మరో వారంలో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం
- తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు
- విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు భారం

రాయదుర్గం: జూన్ నెల వచ్చిందంటే చాలు ఓ వైపు వ్యవసాయం.. మరోవైపు పిల్లల చదువు.. ఇలా తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతాయి. మరో ఆరు రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. పిల్లలకు కావాల్సిన విద్యాసామగ్రి ప్రతిదీ కొత్తవి ఉండాల్సిందే.. కొత్త బ్యాగులు, కొత్త పుస్తకాలు, కొత్త యూనిఫాం.. కొత్త షూస్ ఇలా.. అన్నింటినీ కొనుగోలు చేసేందుకు తల్లిదండ్రులు తలమునకలవుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ కష్టాలు రానివ్వకుండా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేశారు. ఎక్కడాలేని విధంగా ఏపీలో మాత్రమే విద్యాకానుక కిట్లు అందించి, పేద పిల్లల చదువులకు చేయూతనిచ్చారు. వీటికితోడు అమ్మ ఒడి, రైతు భరోసా తంచనుగా బ్యాంకు ఖాతాల్లో పడేవి. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విద్య మరింత భారమవైందని తల్లిదండ్రులు నిట్టూరుస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ 777 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గతేడాది 1,18,530 మంది విద్యార్థులు చదువుకున్నారు. మరో 300ల దాకా ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీరందరికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో విద్యాకానుక కిట్లు అందించారు. బడులు తెరిచిన రోజే బుక్స్, నోట్‌బుక్స్, టై, బెల్టు, షూ, యూనిఫాం చేతిలో పెట్టారు. అలాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే రైతులకు పెట్టుబడి సాయం జమ చేస్తూ వచ్చారు. ఈ కష్టాలు రైతులు మళ్లీ మొదలయ్యాయి. సేద్యం ఖర్చుల కంటే ఫీజుల భారం తడిసి మోపెడవుతోంది. సగటున ఓ విద్యార్థికి రూ.35వేల నుంచి రూ.40 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

విద్యా సామగ్రి కొనుగోలుకు ఒత్తిళ్లు

విద్యార్థులపై ప్రైవేట్ పాఠశాలల యజమానులు నుంచి ఒత్తిళ్లు అధికమవుతున్నాయి. టై, షూ, యూనిఫాంతో పాటు పుస్తకాలు, నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు కూడా పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఏకంగా దుకాణాలే తెరిచారు. వీటి పై ఇప్పటికే విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టారు. యాజమాన్యల తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

జీఓ 1ని అమలు చేయాలి



జీఓ నంబర్-1ని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు అమలు చేయలేదు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. పాఠశాలల పేరుతో ముద్రించిన పాఠ్య, నోట్ పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు మరింత భారం పడుతోంది. అధిక ఫీజుల నియంత్రణతో పాటు విద్యాసామగ్రి విక్రయాలపై ఆందోళనలు చేసినా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల్లో మార్పులేదు.

– ఆంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి

నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు ఇలా..

ప్రవేశ రుసుం	రూ.10 వేలు - రూ.15 వేలు
ప్రత్యేక ఫీజు	- రూ.3 వేలు
పుస్తకాల సంచి చిన్నది	రూ.600
పెద్దది	రూ.1,000
భోజనం తీసుకెళ్లే క్యారీ బ్యాగు, నీళ్ల బాటిల్, సంచి	రూ.500
బస్సు చార్జీలు ఏడాదికి	- రూ.12 వేల నుంచి రూ.15 వేలు
బూట్లు, సాక్సులు	- రూ.550
పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు	- రూ.5,000 - రూ.6,500
యూనిఫాం 2 జతలు	- రూ.2,500
టై, బ్యాడ్జి, బెల్టు, గుర్తింపు కార్డు	రూ.850
పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రి	- రూ.400
మొత్తం మీద ఒక్కో విద్యార్థికి ఖర్చు చేయాల్సి వస్తోంది.	రూ.46,750 నుంచి రూ.50 వేలు

ఆందోళన చేస్తాం



ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఎల్‌కేజీకే రూ.20 వేల నుంచి రూ.25 వేలు వసూళ్లు చేస్తున్నారు. విద్యా వ్యాపారం చేస్తూ పేదల జీవితాలతో చెలగాటమాడితే సీపీఎం తరఫున ఉద్యమాలు చేస్తాం. విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కొనసాగించాలి.

– మల్లికార్జున, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, రాయదుర్గం

చర్యలు చేపట్టాలి



ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగుతున్న కార్పొరేట్ దోపిడీపై విద్యాశాఖ చర్యలు చేపట్టాలి. నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల వసూళ్ల ప్రక్రియ కొనసాగిస్తున్నా అడ్డుకట్టు వేసేవారేలేరు. పాఠశాలల్లోనే విద్యా సామగ్రి విక్రయాలపై నిఘా ఉంచాలి. విద్యార్థుల తల్లిదండ్రులను ఒత్తిళ్లకు గురిచేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం.

– కొత్రేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు

అధిక ఫీజులు వసూళ్లు చేస్తే చర్యలు

ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు చేపడతాం. ఎల్‌కేజీకే వేలాది రూపాయలు వెచ్చించాల్సిన అవసరం లేదు. ఈ విధానాన్ని పిల్లల తల్లిదండ్రులు మానుకోవాలి. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి. పాఠశాలల్లోనే విద్యాసామగ్రి విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

క్లుప్తంగా

కణేకల్లు సీడీపీఓగా నాగమణి


బాధ్యతలు స్వీకరించిన సీడీపీఓ నాగమణి

కణేకల్లు: కణేకల్లు ఐసీడీఎస్ సీడీపీఓగా నాగమణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీడీపీఓ పోస్టు ఖాళీగా ఉండటంతో కళ్యాణదుర్గం సీడీపీఓ లక్ష్మీప్రసన్న ఇన్‌చార్జ్‌గా పని చేశారు. గుత్తిలో పని చేస్తున్న సీడీపీఓ ఎ.నాగమణిని జిల్లా అధికారులు కణేకల్లుకు బదిలీ చేశారు.

అఘాయిత్యాలు జరుగుతున్నా పట్టించుకోరా?


ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: జిల్లాలో దళిత ఆడబిడ్డలపై అఘాయిత్యాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోదా? అని ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు అన్నారు. దళిత బాలికలపై అఘాయిత్యాలను అరికట్టాలని ఆర్డీఓ వసంతబాబును సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. రామగిరి మండలంలో దళిత బాలికపై అత్యాచారం మరవకముందే అనంతపురానికి చెందిన తన్మయ అనే విద్యార్థిని దారుణ హత్యకు గురైందన్నారు. తన్మయ మిస్సింగ్‌పై తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు లాయర్ ఆంజనేయులు, నాగరాజు, చంద్ర, చనమల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ బైక్ ర్యాలీ

రాయదుర్గంటౌన్: రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవ ర్యాలీని సోమవారం నిర్వహించారు. స్థానిక బళ్లారి రోడ్డు బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్ వద్ద నుంచి ప్రారంభమైన బైక్‌ర్యాలీ బళ్లారి బస్టాండ్, వినాయక సర్కిల్, లక్ష్మీబజార్ మీదుగా తిరిగి కోటలోని ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయం వరకు నిర్వహించారు.

ప్రతిభా అవార్డులకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వం 2024-25లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభా అవార్డులు పొందిన విద్యార్థులను శ్రీ చైతన్య స్కూల్ ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ పిలిప్‌కుమార్, డీన్ తిప్పారెడ్డి, ప్రైమరీ ఇన్‌చార్జ్ లీలావతి, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ హేమలత అభినందించారు. కళ్యాణదుర్గం శ్రీచైతన్య టెక్నో కరిక్యులమ్ పాఠశాల విద్యార్థులు గణేష్, నిఖిల్, మృదుల, అంజుమ్, వరుణ్ తేజ్ ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు.

దంపతులకు తీవ్ర గాయాలు

ఉరవకొండ: కణేకల్లు క్రాస్ వద్ద సోమవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి గుంతకల్లుకు చెందిన వన్నూరుస్వామి, భార్య జ్యోతి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. వన్నూరుస్వామి భార్య పిల్లలతో కలిసి విడపనకల్లు నుంచి ఉరవకొండకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వీరిని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు


డాక్టర్లతో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ వసంతబాబు చెప్పారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై డివిజనల్ స్థాయి సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామస్థాయి ఆర్గనైజేషన్లు, సమైక్య గ్రూపుల్లోని ఆశా కార్యకర్తలు, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీఓ డాక్టర్ రాజేష్, గైనకాలజిస్ట్ డాక్టర్ శశికళ, సీఐ యువరాజ్, ఆర్డీటీ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ భవిష్య, ఆరోగ్య విద్య బోధన అధికారి డాక్టర్ కెంచె లక్ష్మీనారాయణ, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, హిమాన్షు, ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

శ్రీవిద్యానికేతన్ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న జి.రిషిత, సంజయ్‌కృష్ణ

కణేకల్లు: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన కణేకల్లు శ్రీవిద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు నలుగురు షైనింగ్ స్టార్స్-2025 అవార్డులకు ఎంపికై జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా సోమవారం అవార్డులను అందుకున్నారు. జి.రిషిత, జే.కావ్యశ్రీ, సీ.ముస్కాన్, బీటీ సంజయ్‌కృష్ణలను జిల్లా కలెక్టర్ రూ.20 వేల ప్రోత్సాహక నగదు, గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రాలను అందజేశారు. అవార్డులు లభించడంతో కరస్పాండెంట్ యు.రవికుమార్‌తోపాటు తల్లిదండ్రులు వారిని అభినందించారు.

విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభం

కణేకల్లు: కణేకల్లులోని రైతుసేవా కేంద్రంలో సోమవారం సబ్సిడీ విత్తన వేరుశనగను ఏఓ శ్రవణ్‌కుమార్ పంపిణీ చేశారు. ఏఓ మాట్లాడుతూ మండలానికి 2,100 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ మంజూరైందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచు ఆనంద్‌రాజ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని 9 ఆర్ఎస్‌కే కేంద్రాల్లో 910 మంది రైతులకు 740 క్వింటాళ్ల విత్తన వేరుశనగను పంపిణీ చేసినట్లు ఏఓ నిర్మల్‌కుమార్ సోమవారం తెలిపారు.

విత్తనకాయలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

వజ్రకరూరు: మండలంలోని గ్రామాల్లోని రైతులు రాయితీ వేరుశనగ విత్తనాలకోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ మధుకర్ సోమవారం తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు వెంటనే రాయితీ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏఓ తెలిపారు.

శాస్త్రీయ యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు


చూలు గొర్రెలకు సీమంతం నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు, పశువైద్యాధికారి

బొమ్మనహాళ్... బెళుగుప్ప: శాస్త్రీయ యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు వస్తాయని పశువైద్యాధికారి డాక్టర్ రమేష్, విరుబ్యాక్ కంపెనీ ప్రతినిధి తిరుపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం నరసాపురం గ్రామంలో విరుబ్యాక్ కంపెనీ సహకారంతో చూడు గొర్రెలకు సీమంతం చేశారు. ఈ ఏడాది జనవరి నెలలో ఐదు చూలు గొర్రెలను ఎంపిక చేసి, రెండు నెలల పాటు నట్టల నివారణ మందు, గ్రోప్లెక్స్, బ్రోటాటానిక్సు ఇచ్చారు. ఎంపిక చేసిన చూలు గొర్రెలకు జన్మించిన గొర్రె పిల్లలను శుభారంభం కార్యక్రమంలో భాగంగా గ్రోవిప్లెక్స్ టానిక్, బ్రోటాన్ ఎస్‌లు వాడటం వల్ల గొర్రెలు అధిక బరువు వచ్చాయన్నారు. శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించిన గొర్రెలకు 10 నుంచి 12 కేజీల అధిక బరువు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, గొర్రెల కాపర్లు పాల్గొన్నారు.

ఉప్పెనలా ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర

- ఆరో రోజూ ఉత్సాహంగా పాదయాత్ర


బహిరంగ సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, పక్కన వైఎస్సార్‌సీపీ నేతలు ఉమా తదితరులు

కుందుర్పి: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ కోసం కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర సోమవారం ఆరో రోజుకు చేరుకుంది. ఉదయం శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలో మొదలైన పాదయాత్ర కుందుర్పి మండలంలోకి ప్రవేశించింది. యర్రగుంట, అల్లాపురం, జానంపల్లి, అపిలేపల్లి, మండలపల్లి వరకు పాదయాత్ర సాగింది. కుందుర్పి మండలంలోకి పాదయాత్ర చేరుకోగానే గ్రామ గ్రామానా పాదయాత్ర చేస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడుకు గ్రామస్తులు పూలతో ఘన స్వాగతం పలికారు. అల్లాపురంలో మహిళలు ఆర్డీటీ కోసం భారీ సంఖ్యలో తరలి వచ్చారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్రజలు పాదయాత్రలో పాల్గొన్నారు. మున్సిపల్ విభాగం కన్వీనర్ ఐ.సుధీర్, వివిధ మండలాల కన్వీనర్లు ఎంఎస్ రాయుడు, గోళ్ల సూరి, జీహెచ్ రాయుడు, హనుమంతరాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటప్ప, ఎంపీపీలు సోమనాథ్‌రెడ్డి, అంజి, కమలా నాగరాజు, భీమేష్, పార్టీ ఉపాధ్యక్షుడు మతం భీమప్ప, బొమ్మలింగ, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు తిప్పేస్వామి, ఐటీ విభాగం తాలూకా అధ్యక్షుడు మర్రిస్వామి, మాజీ వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, తాలూకా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శులు రాజు, ఈరన్న, మంజునాథ్, మాజీ మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, సర్పంచులు వన్నూర్ రెడ్డి, రామ్మూర్తి, అతావుల్లా, గంగాధర, బొమ్మయ్య, వెంకటేశ్, విజయ్, జగన్, ఎంపీటీసీలు కెంచమ్మ, డాక్టర్ ఈరన్న, పెద్దప్పయ్య, జయన్న, వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, నాయకులు గార్మెంట్స్ గోపాల్, సుబ్రి, రాజశేఖర్, వేలం మంజునాథ్, నిజవల్లి బాబు, కోఆప్షన్ సభ్యుడు ముజీ వుల్లా, రామచంద్రప్ప, బసవరాజు, కరియన్న, చౌడప్ప, అంజయ్య, మర్రిస్వామి, లెనిన్ బాబు, బీటీ రాము, రాజు, సురేష్, చేనేత విభాగం శ్రీనివాసులు, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ లింగప్ప, తిమ్మరాజు, తూముకుంట గంగాధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శెట్టూరులో ముగిసిన పాదయాత్ర

శెట్టూరు: ఆర్డీటీ పరిరక్షణ కోసం వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త, మాజీ తలారి రంగయ్య నిర్వహిస్తున్న పాదయాత్ర సోమవారం శెట్టూరు మండలంలో ముగిసింది. లక్ష్మంపల్లి, కంబాలపల్లి మీదుగా కుందుర్పి మండలంలోకి ప్రవేశించింది. లక్ష్మంపల్లిలో సీపీఐ తాలుకా కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి నరసింహులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు మహాదేవ, మండలాల కార్యదర్శులు జయరాములు, ఆంజనేయులు, నాగరాజు నాయక్, ఓంకార్, సీపీఐ నాయకులు బుడేన్, మరళి, చిక్కన్న, నాగభూషణ, రవి, ఉప్పర శీనప్ప, నాగరాజు, రాజ్‌కుమార్, విరుపాక్షి, మారెన్న, కిష్టప్ప, ఆంజనేయులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు మురళి, పండు, యుగంధర్, చరణ్‌లు పాదయాత్రకు మద్దతు పలికారు. అనంతరం కంబాలపల్లిలో వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన సేవ్ ఆర్డీటీ పేరుతో కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమనాథ రెడ్డి, వైస్ ఎంపీపీ ముత్యాలు, స్థానిక సర్పంచ్ చిట్టెమ్మ, పార్టీ అనుబంధ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, హనుమత రెడ్డి, జయరామిరెడ్డి, రామచంద్ర, బాలప్ప, కాటప్ప తదితరులు పాల్గొన్నారు.


యర్రగుంట్లలో ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు భారీగా తరలివచ్చి మద్దతు తెలిపిన జనం


పాదయాత్రకు మద్దతు తెలిపిన మహిళలు


పాదయాత్రకు మద్దతు తెలిపిన నాయకులు, కార్యకర్తలు


లక్ష్మంపల్లి వద్ద పాదయాత్రకు సీపీఐ నాయకుల సంఘీభావం

భారీ వర్షం ..అపార నష్టం


కణేకల్లు-మాల్యం మార్గమధ్యంలో వేదవతి హగిరిలో పారుతున్న వరదనీరు


గోనేహాళ్ వద్ద గాలీవానకు విరిగిపడిన అరటి చెట్లను చూపుతున్న రైతు వెంకటరెడ్డి

కణేకల్లు: కణేకల్లు మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. కణేకల్లు, మాల్యం, హనకనహాళ్, సొల్లాపురం, కె.కొత్తపల్లి, తుంబిగనూరు, ఎన్.హనుమాపురం గ్రామాల్లో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. వర్షపాతం 37.40 ఎంఎంగా నమోదైంది. భారీ వర్షానికి కళేకుర్తి ఎస్సీ కాలనీలోకి నీరు చేరింది. ఇళ్లలోకి నీరు చేరడంతో కాలనీవాసులు రాత్రంతా జాగరణ చేశారు. కణేకల్లు దిగువవీధిలోనూ వర్షపునీరు చేరింది.పలుచోట్ల 33/11కేవీ లైన్ విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. సోమవారం మధ్యాహ్నం 3గంటల వరకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. హనకనహాళ్ శివారులోని వంకకు వరదనీరు పొటెత్తడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కణేకల్లు-మాల్యం మార్గంమధ్యలో ఉన్న వేదవతి హగిరికి వరదనీరు ఉధృతంగా పారి, బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఉరవకొండ నుంచి కణేకల్లుకు వచ్చి వెళ్లే బస్సులు మాల్యంలోనే ఆగిపోయాయి.

గాలీవాన బీభత్సం

బొమ్మనహాళ్: మండలంలో గాలీవాన బీభత్సం సృష్టించింది. ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. 7.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గాలీవాన వర్షం పడటంతో మండలంలోని గోనేహాళ్ క్రాస్ సమీపంలో రైతు వెంకటరెడ్డి 6 ఎకరాల్లో సాగు చేసిన అరటి తోట నేలకొరిగింది. గోనేహాళ్ క్రాస్‌లో చెట్టు విరిగి ఇమ్రాన్ అనే వ్యక్తికి చెందిన మెకానిక్ షాపుపై పడింది. గోనేహాళ్ క్రాస్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం విరిగి రోడ్డుపై పడింది. విద్యుత్‌తీగలు రోడ్డుపై పడిపోయాయి.

బెళుగుప్ప: మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి 30.4 మిమి వర్షపాతం కురిసింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి బెళుగుప్ప, ఆవులెన్న, నక్కలపల్లి గ్రామాల్లో సాగు చేసిన పందిరి బీర పంట నెలకొరిగింది. వీరమ్మ, శ్రీకాంత్, ప్రకాష్, తిప్పారెడ్డి, నరేష్, లక్ష్మీనారాయణ, మనోహర్ అనే రైతులకు చెందిన 30 ఎకరాల్లో పంట నష్టం జరిగింది.

యోగా సాధనతోనే మానసిక ప్రశాంతత

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పే నాయక్

కూడేరు: నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం నుంచి ట్రాన్స్‌కో కార్యాలయం వరకు యోగాపై అవగాహన ర్యాలీ చేశారు. డీపీఓ నాగరాజు నాయుడు పాల్గొన్నారు. సర్పంచ్ లలితమ్మ, డీటీ సూర్య ప్రతాప్, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, సీడీపీఓ శ్రీదేవి, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఏపీఓ పోలేరయ్య, సర్వేయర్ అయేషా సిద్ధికీ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, సూపర్ వైజర్‌అరుణ , కార్యదర్శులు, అంగన్‌వాడీ , ఐకేపీ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ రూరల్: ఉరవకొండలో 5 సచివాలయాల సిబ్బంది 'యోగాంధ్ర'లో భాగంగా ఎంపీడీవో రవి ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ చేశారు.

బెళుగుప్ప: స్థానిక ఎమ్మార్సీ నుంచి కెనరా బ్యాంకు కూడలి వరకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ అధికారులు, సిబ్బంది సోమవారం భారీ ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంపీపీ పెద్దన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.


కూడేరులో మానవహారం ఏర్పాటు చేసిన అధికారులు

రాయదుర్గంటౌన్: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం, ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత వస్తుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో సచివాలయాల వారిగా వార్డుల్లో యోగాంధ్ర-2025 మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో యోగాంధ్ర 2025లో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్‌డీ దాస్, సీహెచ్ఓ ఈశ్వరయ్య, హెల్త్ సూపర్‌వైజర్ విజయభారతి, యుగేంధర్, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాంధ్రాపై ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామకృష్ణ, సీహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ,ఇంచార్జ్ ఈఓఆర్డీ జయరాములు,పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో యోగాంధ్ర కార్యక్రమంపై సోమవారం ర్యాలీ నిర్వహించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని ఆర్డీఓ వసంత బాబు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు. మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భక్తులతో పోటెత్తిన సంగమేశ్వరాలయం


అలంకరణలో పార్వతీపరమేశ్వరులు

కూడేరు: కూడేరులో ప్రఖ్యాతిగాంచిన సంగమేశ్వర స్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. పార్వతి పరమేశ్వర జోడు లింగాలకు ఆలయ అర్చకులు పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

గర్భిణులను జాగ్రత్తగా చూసుకోవాలి

కూడేరు: హైరిస్క్ గర్భిణులను జాగ్రత్తగా చూసుకోవాలని, బీపీ పెరిగితే గర్భంలోని శిశువు మరణించే ప్రమాదం ఉందని వైద్యాధికారిణి ఉషారాణి తెలిపారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో హై-రిస్క్ గర్భిణులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యశోద, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రైవేట్ వాహన డ్రైవర్ల మధ్య ఘర్షణ

ఉరవకొండ: పట్టణంలో శ్రీసాయి లైట్ మోటార్ వెహికల్ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు కొందరు వైట్ బోర్డు ఎర్టికా వాహనదారులకు మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. ఇటీవల అనుమతులు లేకుండా ఆర్టీసీ డిపో వద్ద ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్నారని అసోసియేషన్ సభ్యులు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమతిలేకుండా వాహనాలు నడుపుతున్న వారిని మందలించారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటలు పెరిగి, ఘర్షణకు దారితీసింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలనూ స్టేషన్‌కు తరలించారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య

కూడేరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పునున్నట్లు సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. సోమవారం కూడేరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్ వైజర్లు అరుణ, రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త కళావతి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

కూడేరు: ఆడపిల్లలు, మహిళలపై లైంగిక దాడులు, హత్యలు చేస్తున్న కిరాతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కూడేరులో అఖిల భారత కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిరసన తెలిపారు. బస్టాండ్ ప్రాంతంలోని వైఎస్ఆర్ సర్కిల్లో హత్యకు గురైన గిరిజన విద్యార్థిని తన్మయి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులు వెలిగించి, నివాళులర్పించారు.

ఎలక్ట్రీషియన్‌కు విద్యుత్ షాక్

ఉరవకొండ: స్థానిక ఇంద్రావతి గ్రామానికి వెళ్లే మార్గంలో విద్యుత్ తీగల మరమ్మతుకు వెళ్లిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ కృష్ణబాబు కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. జూనియర్ లైన్‌మెన్ హఫీజ్ సాయం కోరడంతో ఆయన పనికి వెళ్లారు. మరమ్మతులు ప్రారంభించే ముందు సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి ఫీడర్-1 ఎల్‌సీ తీసుకున్నారు. అయితే అధికారులు ఫీడర్-2కు ఎల్‌సీ ఇచ్చారు. విషయం తెలియని కృష్ణబాబు తీగలు తాకగానే షాక్‌కు గురై కుప్పకూలాడు. అపస్మారక స్థితికి చేరుకున్న కృష్ణబాబుకు అటుగా వెళుతున్న కొందరు యువకులు వెంటనే సీపీఆర్ నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు.